ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
7
జిల్లాల వార్తలు
గురువారం 13 జూన్ 2024



మోగిన బడి గంట

● ముగిసిన సెలవులు.. తెరచుకున్న పాఠశాలలు ● తొలిరోజు హాజరు అంతంతే ● పాఠశాలల్లో కనిపించని సందడి

- విద్యార్థులకు సమస్యల స్వాగతం
- జిల్లా కేంద్రంలోనే అధ్వానంగా ఏర్పాట్లు
- తరగతి గదులనూ శుభ్రం చేయని వైనం
- దుమ్ముపట్టిన బెంచీలు
- స్వయంగా శుభ్రం చేసుకున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 12 : వేసవి సెలవులు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా బుధవారం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులంతా బడిబాట పట్టారు. ఏప్రిల్ 23 నుంచి జూన్ 11 వ తేదీ వరకు ప్రభుత్వం ఇచ్చిన వేసవి సెలువులు ముగియడంతో పాఠశాలల్లో బోధన ప్రారంభమైంది. కాగా తొలి రోజు హాజరు అంతంత మాత్రంగానే ఉండడంతో సందడి వాతావరణం కనిపించలేదు. తొలి రోజు 20 శాతం మంది విద్యార్థులు మాత్రమే బడులకు హాజరైనట్టు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

దుమ్ముపట్టిన తరగతి గదులు

పాఠశాలలు పునఃప్రారంభమౌతున్న వేళ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలకాల్సిన కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించారు. ఇందుకు సంగారెడ్డి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రాథమిక పాఠశాలే నిదర్శనం. ముందు రోజు వచ్చి పాఠశాల ఆవరణ, తరగతి గదులు, విద్యార్థులు కూర్చునే డ్యుయల్ డెస్కులు కనీసం శుభ్రం చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఫలితంగా తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు స్వంగా చీపురు పట్టుకుని దుమ్ముపట్టిన తరగతి గదులు, బెంచీలను శుభ్రం చేయడం కనిపించింది.

బడిబాట ద్వారా 3,457 మంది చేరిక

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 3,457 మంది సర్కారు బడుల్లో చేరారని, బుధవారం ఒక్కరోజే 1,215 మంది కొత్తగా బడిలో అడ్మిషన్ పొందారని అధికారులు తెలిపారు. అయితే, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగనున్న నేపథ్యంలో ఈ ఏడాది సుమారు 10వేల మంది పిల్లలను చేర్పించడమే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



సంగారెడ్డిలోని పాఠశాలలో దుమ్ముపట్టిన డెస్కులను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు



సంగారెడ్డి జడ్పీ హైస్కూల్లో తొలి రోజు హాజరైన విద్యార్థినులు

పాఠశాలల్లో సందడి

మెదక్ అర్బన్: వేసవి సెలవుల తర్వాత బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మెదక్ జిల్లా వ్యాప్తంగా బడుల్లో పండుగ వాతావరణం నెలకొంది. బడిబాటలో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరిస్తూ ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. పాఠశాలల తొలిరోజు జిల్లావ్యాప్తంగా దాదాపు 643 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నఆరు. ఈ నెల 6న ప్రారంభమైన బడిబాట 19 వరకు కొనసాగనుంది.



మెదక్ జిల్లా పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గులాబీలు అందజేసి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఉచిత విద్య, వైద్యం

..ఇవే మా ప్రభుత్వ ప్రాధాన్యాంశాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- ప్రైవేట్‌కు దీటుగా వసతుల కల్పన
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

రాయికోడ్, జూన్ 12: రాష్ట్రంలో పేదలకు ఉచిత విద్య వైద్యం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక ప్రణాళికలతో ముందుకు వెళ్తన్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీమాత, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం, విద్య అందించాలని కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్నభోజనం అందిస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను వ్యవసాయ పనులకు కాకుండా పాఠశాలలకు పంపించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. త్వరలోనే ఉపాధ్యాయుల భర్తీని పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పన కోసం రూ.26కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఆర్‌వో ఏడుకొండలు, డీఆర్డీవోపీడీ జ్యోతి, డీఈవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఎంపీపీ అధ్యక్షులు మొగులప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. అంజయ్య, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బాలాజీనర్సింహులు, నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మొరపెట్టుకుంటున్న రైతులు, మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

న్యాయం చేయండి సార్..

అధికారులతో మొరపెట్టుకున్న ట్రిబుల్ ఆర్ భూ బాధితులు

సీఎం దృష్టికి తీసుకువెళ్తా : డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయుల్‌గౌడ్

నర్సాపూర్, జూన్ 12: రిజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని రైతులు అధికారులతో మొరపెట్టుకున్నారు. నర్సాపూర్‌లోని రైతువేదికలో బుధవారం ట్రిబుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న తిర్మలాపూర్, పెద్దచింతకుంట, నాగులపల్లి, తుజాల్‌పూర్, మంతూరు, మూసపేట తదితర గ్రామాల రైతులతో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ తమ భూములు మార్కెట్‌లో ఎకరా రూ. కోటి ధర పలుకుతున్నాయని, ఈమేరకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి స్పందిస్తూ రైతుల అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన గిరిజనులు మాట్లాడుతూ తమ తండాలో 14 ఇళ్ల కూడా కోల్పోతున్నామని, తమను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ తాను మొదటి నుంచి ట్రిబుల్‌ఆర్ రైతుల పక్షాన పోరాడుతున్నానని, తనకు వారి సమస్య తెలుసని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందున సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

2.18 లక్షల క్వింటాళ్లు

సంగారెడ్డి జిల్లాలో సేకరించిన జొన్నలు

- కొనుగోలు కేంద్రాలు మూసివేత
- రూ. 69.37 కోట్ల విలువైన పంట సేకరణ
- రూ.39.36 కోట్లు రైతులకు బకాయి
- ఇంకా కేంద్రాల్లోనే జొన్నలు



నాగల్‌గిద్దలో గోదాంలో నిల్వ చేసిన జొన్నల బస్తాలు

సంగారెడ్డి టౌన్, 12 : సంగారెడ్డి జిల్లాలో జొన్నల కొనుగోళ్ల ముగిశాయి. ఏప్రిల్ రెండో వారలో ప్రారంభమైన జొన్నల కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. జిల్లావ్యాప్తంగా 19 కొనుగోలు కేంద్రాలను సర్కారు ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు మొత్తం 2.18 లక్షల క్వింటాళ్ల జొన్నలను సేకరించారు. జొన్నల కొనుగోళ్ల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆయా మండలాల్లో రైతులు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 30,400 ఎకరాల్లో జొన్నల పంటను సాగు చేశారు.

2.18 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2,18,152 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు మార్క్ఫెడ్ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30,400 ఎకరాల్లో జొన్న పంట సాగు చేయగా 2.75 లక్షల క్వింటాళ్ల జొన్నల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే 11,068 మంది రైతుల నుంచి 2,18,152 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. జొన్నలకు మద్దతు ధర క్వింటాలుకు రూ.3,180 ప్రభుత్వం నిర్ణయించింది. జొన్నల కొనుగోళ్ల కోసం జిల్లాలో 19కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసింది. ఇందులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నాగల్‌గిద్ద, నిజాంపేట, రాయికోడ్ , సదాశివపేటలలో ఏర్పాటు చేశారు. అలాగే ఐకెపి ద్వారా కల్హేర్ , మార్డి, సంజీవన్‌రావుపేట, బీబీపేట, బొక్కస్‌గాం, చెల్మడకాలనీ, ఏడాకులపల్లి, ఝరాసంగం, తడ్కల్, కంగ్టి, ఖాదిరాబాద్, కొండాపూర్ గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్నలను కొనుగోళ్లు చేశారు.

రూ.39.37 కోట్ల బకాయిలు

జిల్లాలో 11,068 మంది రైతుల నుంచి రూ.69.37 కోట్ల విలువ చేసే 2,18,152 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. ఇందులో 1,82,372 క్వింటాళ్ల జొన్నలను గోడౌన్లకు తరలించారు. ఇంకా 35,780 క్వింటాళ్లు గోదాంలకు చేర్చాల్సి ఉన్నది. ఇప్పటివరకు 6013మంది రైతుల ఖాతాల్లో రూ. 30.01కోట్ల జమఅయినట్లు మార్క్ఫెడ్ అధికారులు తెలిపారు. ఈ మొత్తం నాలుగెదు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ఆశాఖ అధికారులు తెలిపారు.

ఎస్‌ఏలకు నేడు పదోన్నతులు

డీఈవో ఆఫీస్‌లో ఎస్జీటీల ధ్రువపత్రాల పరిశీలన

కొనసాగుతున్న టీచర్ల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ



సంగారెడ్డిలో ఉపాధ్యాయుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 12 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. జడ్పీ మేనేజ్‌మెంట్‌లో గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా(గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు, సమానమైన కేడర్ పోస్టులకు సంబంధించిన ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రదర్శించిన అధికారులు బుధవారం వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభించారు. అర్హులకు జీహెచ్‌ఎం పదోన్నతినిస్తూ నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్స్ పొందేందుకు అర్హత కలిగిన ఎస్జీటీలకు సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు.

ఏ సమస్య వచ్చిన ముందుంటా

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, జూన్ 12: మెదక్ పార్లమెంటరీ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతానని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట శరభేశ్వర ఆలయంలో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శివ పార్వతుల కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో అమర్నాథ్ యాత్రకు వెళుతున్న అన్నదాన సరుకుల లారీని ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు కలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావుకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల వేళ ఒకరిపై ఒకరు విమర్శల గుప్పించుకున్న వారిద్దరూ ఇప్పుడు కలుసుకోని మాట్లాడుకోవడం గమనార్హం.



అమర్నాథ్ లంగర్‌కు సరుకులు తీసుకువెళ్తున్న లారీని ప్రారంభిస్తున్న రఘునందన్‌రావు, హరీశ్‌రావు

విద్యుత్ షాక్‌తో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

మెదక్ అర్బన్, జూన్ 12: మెదక్ జిల్లాలో బుధవారం వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మెదక్ మండలం గుట్టకిందిపల్లికి చెందిన చింతల నర్సింహులు(38) బుధవారం పట్టణ పరిధి గాంధీనగర్‌లోని ఎల్లమ్మగుడి మైక్‌లను కట్టేందుకు పైకి ఎక్కాడు. ఈక్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో మృతిచెందాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ పట్టణ సీఐ తెలిపారు.



నగేష్(ఫైల్)

పేరూర్‌లో రైతు..

కరెంట్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన బుధవారం మెదక్ మండల పరిధిలోని పేరూర్‌లో చోటుచేసుకుంది. మెదక్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెల్మకన్న నగేష్(42) తన పొలం వద్ద పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్‌ను పట్టుకున్నాడు. దానికి కరెంట్ సరఫరా కావడంతో నగేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో, గ్రామస్థులు, కుటుంబీకులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే నగేష్ మృతికి కారణమంటూ మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కేశవులు, ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ తిరుపతి గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుకు 40 గొర్రెలు మృత్యువాత

రామాయంపేట: పిడుగుపాటుకు 40 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మెదక్ జిల్లా రామాయంపేటలోని వెంకన్న గారి చెరువు సమీపంలో చోటు చేసుకున్నది.బుధవారం ఉదయం గొర్రెల కాపర్లు మేకల మందను మేత కోసం తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో గొర్రెల మంద ఓ చెట్టు కిందకు చేరుకున్నాయి. ఆ చెట్టుపై పిడుగుపడడంతో 40 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రజిని, మెటర్నరీ అధికారులు పంచనామా నిర్వహించారు.

'రామంతపూర్ ఊర చెరువు తూములకు మరమ్మతు చేయాలి'

మాసాయిపేట, జూన్ 12: మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలోని ప్రధాన ఊర చెరువుకు గల ప్రధాన తూములకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత వర్షాకాలంలో చెరువుకు గండ్లు పడి పెద్దఎత్తున నీరు బయటకు వెళ్లిపోయిందన్నారు. మరమ్మతులు చేయాలని ఏడాది నుంచి కోరుతున్నా.. ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీవో 970ను సవరించాలని వినతి

నర్సాపూర్, జూన్ 12: మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం కలిగే విధంగా ఉన్న జీవో 970ను సవరించి తమకు న్యాయం జరిగేలా చూడాలని మున్సిపల్ ఉద్యోగులు మున్సిపల్ ఛైర్మన్ అశోక్ గౌడ్, కమిషనర్ జైరామన్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగే విధంగా ఉన్న ఈ జీవోను సవరించి సీనియారిటీ, విద్యార్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పట్ల సీఎం సానుకూలం

టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



మెదక్ అర్బన్, జూన్ 12: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, దశల వారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి ఉద్యోగుల సమస్యలను లేవనెత్తగా పై విధంగా స్పందించారన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులందరికీ న్యాయం చేకూర్చే విధంగా సబ్ కమిటీ పని చేస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపినట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట మెదక్ జిల్లా టీఎన్జీవోలు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రాజెక్ట్

మెదక్ అర్బన్, జూన్ 12: మహిళల ఆర్థికాభివృద్ధికి దోహద పడేలా ఇంటర్ విద్యార్థిని అనిక పెన్నీఫిక్స్ పేరుతో ఓ ప్రాజెక్టు రూపొందించారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మాచవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి, ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. అనిక మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుతో మహిళలకు చేతి పనులు, కాటేజ్ ఇండస్ట్రీస్, లెస్ తయారీ, గృహ వ్యాపారాలు, ఎంబ్రాయిడరీ వంటి లాభదాయకమైన పనులతో ఉపాధి పెంపొందడమే కాకుండా వారి ఆదాయ మార్గాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహాలక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగులో లాభాలు అధికం

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సోమేశ్వర్‌రావు

సంగారెడ్డి టౌన్, జూన్ 12: డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుతో లాభాలు అధికంగా ఉంటాయని జిల్లా ఉద్యాన, పట్టు పరి శ్రమల శాఖ అధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. సంగారెడ్డి లోని కార్యాలయంలో బుధవారం జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగుచేస్తున్న రైతులతో సదస్సును నిర్వహించారు. పంట సాగు, పంటను అమ్ముకునే క్రమంలో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ మే, జూన్ మాసాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట పూతదశకు వస్తుందన్నారు. ఎక్కువగా వచ్చిన పూతలో కొన్ని పూలను తొలగించడం వల్ల కాయ పరిమాణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గ్రేడింగ్ చేయకుండా పండ్లను మార్కెట్‌కు తరలిస్తే ఆశించిన లాభా లు రావన్నారు. గ్రేడింగ్ చేసిన పండ్లకు మార్కెట్‌లో భాగా డిమాండ్ ఉన్నదన్నారు. ప్రీ కూలింగ్ తర్వాత కాయలను గ్రేడింగ్ చేసి, ప్యాకింగ్ చేయాలని సూచించారు. అయితే, శీతల గిడ్డంగులు లేకపోవడంతో కాయ నిలువ చేసుకునే అవకాశం లేదని పేర్కొన్నారు. డ్రాగన్ ఫ్రూట్ నిలువ, విక్రయానికి సంబంధించిన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, ఫల పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర, శాస్త్రవేత్త హరికాంత్, ఉద్యానశాఖ అధికారులు శైలజ, సమత, బీశైలజ, కీర్తి పాల్గొన్నారు.

కలెక్టర్ల బడిబాట

పాఠశాలలను పరిశీలించిన జిల్లా బాస్‌లు: పుస్తకాలు, యూనిఫాం పంపిణీ



ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం/కొండపాక/రాయికోడ్, జూన్ 12: పాఠశాలల పునఃప్రారంభమైన మొదటి రోజు మూడు జిల్లాల కలెక్టర్లు బడిబాటలో భాగంగా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలను అందజేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట, ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలల్లో జరిగిన బడిబాట కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండల దుద్దెడ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లోని పలు పాఠశాలలను కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశీలించారు.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో ప్రపంచాన్ని జయించవచ్చునని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కొల్చారం మండలం సంగాయిపేట, ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలలను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో పాల్గొన్నారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో సరస్వతీదేవీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు జిల్లా విద్యాధికారి ప్రొ.రాధాకిషన్, ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌లతో కలిసి అందించారు. పాఠశాలలో అన్ని తరగతి గదులు తిరుగుతూ పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడుగుతూ వాటిని పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 562 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సుమారు రూ. 20 కోట్లతో అన్ని రకాల పెం డింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని పాఠశాలలో ఇప్పటి వరకు 93శాతం పెండింగ్ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీఎం సుసిల్వ, ఏపీవో మహిపాల్‌రెడ్డి, సీఆర్పీలు సాయికుమార్, రాములు, శ్రీనివాస్, నాయకులు పెద్ది నారాయణ, ఆకుల రమేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో మానసిక ధృడత్వం పెంచాలి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఏదైనా సాధించగలనని మానసిక ధృడత్వాన్ని పెంచాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, పాఠశాల పునఃప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తానూ మంచిర్యాల జిల్లాలోని దేవపూర్ అనే మారుమూల గ్రామంలో చదువుకున్నానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 814 ప్రభుత్వ స్కూళ్లలో రూ. 35 కోట్లతో పనులు చేపట్టామని, మరో వారం, పదిహేను రోజులలో పనులు పూర్తయితాయని కలెక్టర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న 66 మందిని దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేర్పించినందుకు, పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీపీఓ దేవకీదేవి, ఎంఈఓ పి శ్రీనివాసరెడ్డి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎంపీపీ మంచాల అనసూయ, పాఠశాల హెచ్ఎం లక్ష్మి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

రాయికోడ్‌లోని పలు పాఠశాలను బుధవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ప్రాథమికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాలను పరిశీలించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య కలెక్టర్ దృష్టికి రాగా, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల నివేదికలను తనకు అందజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.ఏ.శరీఫ్, ఎంఈవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, రెవెన్యు ఇన్స్ స్పెక్టర్ ప్రభాకర్, రామచందర్, మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



రాయికోడ్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి



ఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సంగారెడ్డి మండలం కల్పగూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- పలు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నారాయణఖేడ్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, విద్యార్థులు చక్కగా చదువుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**జహీరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నెంబర్-3 పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంను అందజేశారు.

●**సంగారెడ్డి రూరల్:** సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ ఎంపీపీ లావణ్యదుర్గేష్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ను అందజేశారు.

●**జోగిపేట:** జోగిపేట మున్సిపల్ పరిధిలోని జోగిపేట, అందోలు పట్టణాల్లోని ప్రభుత్వోన్నత పాఠశాలల్లో మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, వైస్ చైర్మన్ మేతరి డేవిడ్ (ప్రవీణ్), కౌన్సిలర్ డాకూరి శంకర్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ తిరుపతి పాల్గొన్నారు.

●**మునిపల్లి:** మండల కేంద్రమైన మునిపల్లితోపాటు అంతారం, ఖమ్మంపల్లి తదితర పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బాల్‌రాజ్, ఖమ్రోద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

●**జిన్నారం:** మండలంలోని మాధారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నోటుబుక్స్‌ను మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు.

●**కల్హేర్:** మండల కేంద్రమైన కల్హేర్‌లో బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఈవో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, కల్హేర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు శైలజ, సుందరమ్మ పాల్గొన్నారు.

●**గుమ్మడిదల:** మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని బొంతపల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్స్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు.

మెదక్ జిల్లాలో

పెద్దశంకరంపేట, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్య నందిస్తామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్, బుజ్రాన్‌పల్లి, గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్‌ఉన్నిసా, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

●**శివ్వంపేట:** మండల కేంద్రమైన శివ్వంపేట ఉన్నత పాఠశాల, ఎదుల్లాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంఈవో బుచ్చానాయక్ పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను పంపిణీ చేశారు.

●**చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం యూనిఫాం అందజేసినట్లు ఏపీఎం ప్రేమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు పురుషోత్తం, వెంకటలక్ష్మి, నర్మద, వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**రేగోడు:** మండలంలోని దోసపల్లి, గజవాడ, పోచారం, పెద్దతండాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

●**పాపన్నపేట:** వేసవి సెలవులు పూర్తి కావడంతో బుధవారం మండల వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గులాబీ పువ్వులు ఇచ్చి ఉపాధ్యాయులు స్వాగతం పలికి, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

'బడిబాట' నిర్వహణ నిధులు మంజూరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 12: జిల్లాలో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహణ ఖర్చులకు రాష్ట్ర విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.వెయ్యి చొప్పున కేటాయించింది. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించాలని ఆదేశాలున్న విషయం తెలిసిందే. అవసరమైన బ్యానర్లు, కరపత్రాలు, సమావేశాల నిర్వహణ నిమిత్తం ఆ డబ్బులు వినియోగించనున్నారు. జిల్లాలోని 1214 పాఠశాలలకు రూ.వెయ్యి చొప్పున రూ.12,14,000 నిధులు మంజూరు చేసింది. ఇక పీఎంశ్రీ కింద ఎంపికైన 19 పాఠశాలలకు వేరుగా మరో రూ.19 వేల నిధులు విడుదల చేసింది.



కవేలి ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బురద నీటిలో నుంచి వస్తున్న విద్యార్థులు

ఇదేనా బడిబాట!

కోహీర్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి జూన్ 12న పిల్లలందరూ బడికి వచ్చేవిధంగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం బడిబాట చేపట్టినా ఉపాధ్యాయుల నిర్లక్ష్యం మూలంగా మొదటిరోజే విద్యార్థులు అవస్థలు పడ్డారు. కోహీర్ మండలంలోని కవెల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో బురదనీరు నిండిపోవడంతోపాటు సమీపంలో ఉన్న నీటి ట్యాంక్ నుంచి నీరంతా వృథాగా పోయి పాఠశాల ఆవరణలో పారుతుంది. అయితే బురదనీటిలోంచి పిల్లలు దాటుతుండడాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఆంజనేయులు (ఫైల్)

వెల్దుర్తి, జూన్ 12: విద్యుదాఘాతంతో వ్యక్తి బుధవారం మృతిచెందాడు. వెల్దుర్తి మండలం రామాయిపల్లి గ్రామానికి చెందిన ఆంజేయులు(45) ఎలక్ట్రీషియన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్‌కు మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి రామమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవతగౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



నర్సింహులు (ఫైల్)

వెల్దుర్తి, జూన్ 12: చికిత్స పొందుతున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన పందుల నర్సింహులు(45) ఈనెల1న గ్రామంలో కూలీ పనులకు వెళ్లాడు. ఓ బావి వద్ద చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. వెంటనే నర్సింహులును చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఎంవీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గుండెపోటుతో రావడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు మహేష్, అంజనేయులు ఉన్నారు.

ధాన్యం డబ్బులు భార్యకు ఇచ్చారని తల్లిదండ్రులపై దాడి

శివ్వంపేట, జూన్ 12: ధాన్యం డబ్బులు తనకు ఇవ్వకుండా భార్యకు ఇచ్చారనే ఆవేశంతో తల్లిదండ్రులపై కొడుకు బుధవారం దాడిచేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్వ నాగమ్మ, మల్లయ్య పెద్ద కుమారుడు రమేష్ తనకు రావాల్సిన వడ్ల డబ్బులను ఇవ్వమని అడిగాడు. వడ్ల డబ్బులు నీ భార్య పద్మ తీసుకెళ్లిందని చెప్పగా.. నా భార్యకు ఎందుకు ఇచ్చారని తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. మల్లయ్య నాగమ్మ రెండో కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైపాల్‌రెడ్డి తెలిపారు.

పిడుగుపాటుతో పాడి గేదె మృతి

చిలప్‌చెడ్, జూన్ 12: పిడుగుపాటుకు గుర్రై పాడి గేదె మృతిచెందింది. మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో రోజు మాదిరిగానే చెట్టు కింద పాడి గేదెను కట్టేసి జోగిపేటకు విత్తనాలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. సాయంత్రం మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా పిడుగు పడడంతో పాడిగేదె మృతిచెందిందని తెలిపారు. గేదె విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

'ఖేడ్ డిపోకు నూతన బస్సులు కేటాయించాలి'

నారాయణఖేడ్, జూన్ 12: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని, డ్రైవర్, కండక్టర్లను నియమించాలని డీఎం మల్లేశయ్య కోరిక మేరకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బుధవారం లేఖను అందజేశారు. డిపో మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ, దూర ప్రాంతాలకు బస్సులను నడపడం కోసం పది పల్లెవెలుగు, ఐదు ఎక్స్‌ప్రెస్, రెండు సూపర్ లగ్జరీ బస్సులు, నాలుగు డీలక్స్ బస్సులతో పాటు 50 మంది కండక్టర్లను, 70 మంది డ్రైవర్లను ఇప్పించాలని కోరారు.

గురుకులాలను తొలగించే ఆలోచనను మానుకోవాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం

జోగిపేట, జూన్ 12: రాష్ట్రంలోని పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తోన్న రెసిడెన్షియల్ పాఠశాలలను తొలగించాలన్న ఆలోచనను, ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకులాల వల్ల కుటుంబ సంబంధాలు బలహీన పడుతున్నాయని సీఎం స్థాయిలో రేవంత్‌రెడ్డి మాట్లాడడం ఆక్షేపణీయమని అన్నారు. తాను, మోదీ, చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివామని గొప్పలు చెప్పే రేవంత్‌రెడ్డి.. రెసిడెన్షియల్ స్కూళ్లను మూసేస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. గురుకులాల తొలగింపు చర్యను మానుకోవాలన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది

జిన్నారం, జూన్ 12: కాజీపల్లి 181 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూములలో నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూములలో నిర్మించిన పలు గదులు, ప్రహరీ, బేస్‌మెంట్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

- విద్యుత్‌శాఖ మండల అధికారి ప్రశాంత్

మునిపల్లి, జూన్ 12: ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైనందున విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైర్లను తాకడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ మండల అధికారి ప్రశాంత్ బుధవారం తెలిపారు. ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటామని, ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ సమస్య ఉంటే (ఏఈ ప్రశాంత్) 94408 13658 నంబరుకు ఫోన్‌చేయాలన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి

జహీరాబాద్/కంగ్టి, జూన్ 12: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు రికార్డుల నిర్వహణ కచ్చితంగా చేపట్టాలని జహీరాబాద్ వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాల్లో రికార్డుల నిర్వహణ, ఎరువుల స్టాక్ వివరాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెడితే సహించమని హెచ్చరించారు. కంగ్టి మండల పరిధి తడ్కల్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు స్టాక్ వివరాలను పరిశీలించారు.

వర్షానికి కూలిన ఇళ్లు, తప్పిన ప్రమాదం



నేలమట్టమైన ఇళ్ల వద్ద బాధితులు

చిన్నశంకరంపేట, జూన్ 12: చిన్నశంకరంపేట మండలంలోని మలుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పొన్నబోయిన నాగరాజు, భూపాల్‌కు చెందిన రెండు ఇళ్లు కూలిపోయాయి. పైకప్పు రేకులతో పాటు ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కూలిపోయిన ఇళ్లను పంచాయతీ కార్యదర్శి బుధవారం పరిశీలించి, పంచనామా చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు నాగరాజు, భూపాల్ కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు రేపు దరఖాస్తులు ఆఖరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 12: ఐటీఐల్లో ప్రవేశాల కోసం ఈ నెల 14వ తేదీవరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో ప్రవేశం పొందేందుకు 14 ఏళ్లు నిండినవారు అర్హులని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషినిస్టు, మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్, డ్రాఫ్ట్ మెన్ సివిల్ ఎలక్ట్రానిక్ మెకానిక్, కోపా, స్టేనోగ్రాఫి, డిజైన్, టెక్నాలజీ, వెల్డర్, మెకానిక్ డిజిల్ ట్రేడ్లలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షెట్కార్‌కు శ్రీవారి లడ్డూ ప్రసాదం అందజేత

నారాయణఖేడ్, జూన్ 12: జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్ గెలిస్తే మోకాళ్లపై తిరుమల అలిపిరి మెట్లు ఎక్కి శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కుకున్న ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నందు, సురేష్‌షెట్కార్ విజయం సాధించడంతో ఇటీవలే తిరుమలకు వెళ్లి మొక్కును తీర్చుకున్నారు. బుధవారం తిరిగి వచ్చి ఖేడ్‌లో షెట్కార్‌ను ఆయన స్వగృహంలో కలిసి శాలువాలతో సన్మానించి శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

కోహీర్‌లో తాగునీటి సమస్య తీర్చండి

కోహీర్, జూన్ 12: మండల కేంద్రమైన కోహీర్‌లోని గొల్లబండ, కస్బా, శివాజీచౌక్, శిశు మందిర్ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని కోహీర్‌కు చెందిన పలువురు బుధవారం ఎంపీడీవో భారతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొన్నిరోజులుగా కోహీర్‌లోని పలు కాలనీల్లో తాగునీరు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శిశుమందిర్ ప్రాంతంలో బోరు మోటార్ చెడిపోయి ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ బాగు చేయలేదన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

సమాచారం

వివాహిత అదృశ్యం

మాసాయిపేట: వివాహిత అదృశ్యమైన సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం పోతన్‌పల్లికి చెందిన బచ్చోళ్ల రేణుక(25) మెదక్ పట్టణంలో ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకుంటానని ఈ నెల 10న వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

చేగుంట: చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం ఆర్‌వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి, గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

'సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

జహీరాబాద్: చెరకు పంట సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో చెరకు రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కంగ్టి: మండల పరిధిలోని నాగూర్.కెలోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఎంపీడీవో సత్తయ్య సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు వడ్డించారు.

నేడు మెదక్‌కు రఘునందన్‌రావు

మెదక్ అర్బన్: ఎంపీ హోదాలో తొలిసారి మెదక్ వస్తున్న రఘునందన్‌రావుకు ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని పంచముఖి ఆలయానికి ఆయన చేరుకుని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి సాయిబాలాజీ గార్డెన్ వరకు ర్యాలీ సాగనున్నది.

వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జూన్ 12: నిరుపేదలకు మెరుగైన వైద్యమందించే ఉద్దేశంతో పట్టణంలో ఏర్పాటుచేసిన 100 పడకల ఆస్పత్రిలో పనిచేసే వైద్యసిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆస్పత్రి సూపరింటెండెంట్, పలువురు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి నిరుపేదలు మాత్రమే వస్తారని, అలాంటి వారికి మెరుగైన వైద్యమందించడంలో వైద్యులు విఫలం కావడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో 40 మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా.. కేవలం 15మంది మాత్రమే ఉండడమేంటని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విధుల్లో పాల్గొనే వైద్య సిబ్బంది, వైద్యులు హాజరు పట్టికలో సంతకాలు ఎందుకు చేయడం లేదని, సంతకాలు చేయడం బరువైతుందా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే విధుల్లో ఉన్న పలువురు వైద్యులను పిలిపించి హాజరు పట్టికలో ఎమ్మెల్యే సంతకాలను చేయించారు. 40 మంది వైద్యులు ఏమేమి పనులు చేస్తున్నారని, వారంతా ఎక్కడున్నారని అడిగారు. 10 మంది డిప్యూటేషన్‌పై ఉన్నారని, మరికొందరు ఇప్పుడే వెళ్లిపోయారని సూపరింటెండెంట్ సమాధానం ఇవ్వడం తీరు బాగోలేదన్నారు. అనంతరం ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన ఫోన్ ద్వారా కలెక్టర్‌కు, వైద్య విధాన పరిషత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం మండలాల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి రూరల్/చిన్నశంకరంపేట, జూన్ 12: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చౌటకూర్ మండలం శివ్వంపేట జడ్పీహెచ్ఎస్, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవార విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యాదయ్య, ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. 18 ఏళ్లలోపు చిన్నారులతో పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కార్మిక అధికారి సత్యేంద్రప్రసాద్ హెచ్చరించారు. బాలల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం చిన్నశంకరంపేట గ్రామ శివారులోని శ్రీమలాని ఫోమ్ పరిశ్రమలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి



మాట్లాడుతున్న భూపాల్

సంగారెడ్డి రూరల్, జూన్ 12: కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.15,600లలో 12,093 చెల్లించి మిగతా డబ్బును ఈఎస్ఐ, పీఎఫ్‌లకు జమచేయాల్సి ఉందని కానీ కాంట్రాక్టు సంస్థలు రూ.10,500 నుంచి రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను సందర్శించిన మెడికల్ ఆఫీసర్

చిలప్‌చెడ్, జూన్ 12: మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల పల్లె దవాఖానాను కౌడిపల్లి మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైందని, అంటురోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనవెంట సూపర్‌వైజర్ రమేష్ ఉన్నారు.

'రైతులకు నష్టపరిహారం చెల్లించాలి'

సంగారెడ్డి రూరల్, జూన్ 12: రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ధర నిర్ణయించి నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ సంగారెడ్డి మండలాధ్యక్షుడు బుచ్చి రాములు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాలకు అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆడ పిల్లలున్న రైతు భూమి అమ్మి పెళ్లి చేస్తామనే ధైర్యముండేదని, కానీ ప్రభుత్వం ధర నిర్ణయించకుండా ఎండాస్మెంట్ నోటీసులు ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు సరైన ధర నిర్ణయించి ఆదుకోవాలని కోరారు.

పెద్ద చెరువు తూము మరమ్మతులకు నిధులు కేటాయించండి

- కలెక్టర్‌కు రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొల్చారం, జూన్ 12: కొల్చారం మండలం సంగాయిపేట పెద్ద చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు బుధవారం గ్రామానికి చెందిన రైతులు వినతి పత్రం సమర్పించారు. బడిబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు సంగాయిపేట ప్రాథమిక పాఠశాలకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. కొల్చారం మండలంలోని సంగాయిపేట పెద్ద చెరువు తూము వద్ద బుంగపడి నీరు మొత్తం వృథాగా కిందికి పోతుందన్నారు. 30 ఏళ్లుగా అలుగు పారని పెద్ద చెరువు ఈఏడాది అలుగు పారిందని, తూము లీకేజీ కారణంగా నీరంతా కిందికి వెళ్లిపోయిందన్నారు. తూము మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రైతులు ఆకుల రమేష్, పెద్ద నారాయణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట తైబజార్‌కు వేలం

చిన్నశంకరంపేట, జూన్ 12: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని బుధవారం ఎంపీవో కలిముల్ల ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన నిద్రబోయిన బాగులు రూ.6 లక్షల 80 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఈవో నాంపల్లి, మాజీ ఉపసర్పంచ్ జీవన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో కుంకుమార్చన, హోమం

నర్సాపూర్, జూన్ 12: నర్సాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో కుంకుమార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని దుర్గామాత ఆలయం నుంచి పెద్దఎత్తున మహిళలు బోనాలతో ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు అయ్యంగారి శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షుడు అంజిగౌడ్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే సహించం: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అధ్యక్షుడు కే.దేవిదాస్

ఝరాసంగం, జూన్ 12: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేవిధంగా అధికారులు వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని ఎంపీపీ అధ్యక్షుడు కే.దేవిదాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ జాప్యం జరుగుతుందని, దీంతో గ్రామాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో మురుగు కాలువలు నిండి ప్రవహిస్తున్నాయని, సంబంధిత అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. గతంలో మిషన్ భగీరథ పథకం కింద గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తే.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3.50 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.80వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. జీర్లపల్లి, పొట్టిపల్లి, బర్దీపూర్, మేదపల్లి గ్రామాల్లో గల చెరువులకు మర్మతులు చేపట్టాలని ఎంపీపీతోపాటు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల వ్యాప్తంగా 120 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ సంజీవరావు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వినీలానరేష్, ఎంపీటీసీలు శంకర్‌పాటిల్, విజేందర్‌రెడ్డి, సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సురేశ్‌షెట్కార్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'

సంగారెడ్డి అర్బన్, జూన్ 12: జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త, రాజకీయ విశ్లేషకుడు అనుముల నర్సింగరావు డిమాండ్ చేశారు. పీసీసీ చీఫ్‌గా సురేశ్‌షెట్కార్‌కు అన్ని అర్హతలున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా నారాయణఖేడ్ నియోజకవర్గం ఎమ్మెల్యేలకు ఏ ఒక్క పార్టీ తరఫున మంత్రి పదవులు రాలేవన్నారు. సురేశ్‌షెట్కార్ చిన్న వయస్సులోనే ఉమ్మడి మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి మంచి గుర్తింపు పొందారన్నారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్



దేవ్‌రాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. 22న ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌వై.క్రికెట్.ఇన్)లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడతున్నామని దేవ్‌రాజ్ చెప్పారు.